


నేడు కలెక్టరేట్‌లో స్పందన

అమలాపురం టౌన్, జనవరి 21: కలెక్టర్ కార్యాలయంలోని గోదావరి భవన్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి జిల్లాస్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అర్జీదారులు తమ సమస్యలను జిల్లా అధికార యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలన్నారు.



జై శ్రీరామ్

నేడు అయోధ్యలో బాల రాముని ప్రాణప్రతిష్ఠ
ఊరారా పండుగ వాతావరణం

అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ మహోత్సవానికి గడియలు దగ్గ రపడడంతో ఊరూరా జైశ్రీరామ్ నినాదం మార్మోగిపోతోంది. ప్రతి రామాలయం వద్ద పండుగ వాతావరణం నెలకొంది. సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆయా ఆలయ కమిటీలు సన్నద్ధమయ్యాయి. శ్రీరాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఊరూరా శోభాయాత్రలు నిర్వహించారు. కాషాయ జెండాలతో, శ్రీరాముని నినాదాలతో వీధులు శోభాయమానంగా కనిపించాయి.



యానాంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం



యానాంలో ఘనంగా శోభాయాత్ర

యానాం, జనవరి 21: యానాం నియోజకవర్గంలో బలరాముని శ్రీరామ శోభాయాత్రను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అయోధ్యలో బలరాముని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా యానాం నియోజకవర్గ పరిధిలోని అన్ని రామాలయాల రామభక్త కమిటీల ఆధ్వర్యంలో శ్రీరామ శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక చింతా వారి వీధిలోని రామాలయం నుంచి ర్యాలీ ప్రారంభమైంది. ర్యాలీలో ప్రత్యేక వాహనంలో రాములవారి చిత్రపటం ఏర్పాటు చేశారు. యానాం పరిపాలనాధికారి మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, జబర్దస్త్ కమెడియన్ రోలర్ రఘు పూజలు నిర్వహించారు. అనంతరం ర్యాలీ ప్రారంభమైంది. కార్యక్రమంలో యానాం బీజేపీ అధ్యక్షుడు కనకాల రాజు, నల్ల వెంకన్న, కాపగంటి ఉమాశంకర్, హంసారి రామలక్ష్మణుడు, ఎన్‌పీవీ రామారావు, గుత్తుల గోవింద జయరామారావు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం



జైశ్రీరామ్ నినాదాలతో మార్మోగిన అమలాపురం

అమలాపురం టౌన్, జనవరి 21: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపనా కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆదివారం ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక గడియార స్తంభం సెంటర్ నుంచి జైశ్రీరామ్ నినాదాలతో బస్టాండ్ సెంటర్ వరకు శోభాయాత్ర నిర్వహించారు. శతాబ్దాల హిందువుల కల నెరవేరిందని సత్తిబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు గోకరకొండ హరిబాబు, కొమ్మూరి వెంకటాచలప్రసాద్, దొమ్మేటి సాయిబాబు, నల్లా పవన్, మేడిచర్ల త్రిమూర్తులు, వలవల శివరావు, అనుపోజు శ్రీను పాల్గొన్నారు.

దీపాలు వెలిగిద్దాం

బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లాలోని వ్యాపార సోదరులు తమ దుకాణాల వద్ద, ఇళ్ల వద్ద శ్రీరాముని పతాకాలను ఎగురవేయాలని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ పిలుపునిచ్చారు. 500 ఏళ్ల కల ఈ రోజుకు నెరవేరిందన్నారు. సోమవారం రాత్రి గడియార స్తంభం సెంటర్‌లో దీపోత్సవం నిర్వహిస్తున్నామని, వ్యాపారులంతా పాల్గొని తమ భక్తిని చాటుకోవాలన్నారు.

నాట్లు వేసేందుకు నారును సిద్ధం చేస్తున్న కూలీలు





జనవరి నెల ముగుస్తున్నా జిల్లాలో ఇంకా వరినాట్లు పూర్తి కాలేదు. సహజంగా రబీ సీజన్ నవంబరు నెలలో నారుమడులు వేసి డిసెంబరు 2, 3 వారాల్లో రైతులు నాట్లు వేస్తుంటారు. అయితే ఈ ఏడాది ఫిబ్రవరి నెల సమీపిస్తున్నా ఇంకా వరినాట్లు వేస్తూనే ఉన్నారు. ఇప్పుడు వరినాట్లు వేస్తే మే నెలకు గానీ పంట చేతికి రాదు. దీంతో పంటకాల్వలు, మురుగు కాల్వలకు మరమ్మతులు చేపట్టడం సాధ్యం కాదు.

వరినాట్లలో వెనుకపడ్డాం

- జనవరి ముగుస్తున్నా జిల్లాలో ఇంకా పూర్తికాని నాట్లు
- కోతలు జాప్యం కావడంతో నాట్లు ఆలస్యం
- ఇలా అయితే మే నెలకు కాని దిగుబడి రాదు
- ఇప్పటికీ రైతులకు అందని ధాన్యం బకాయిలు
- మరోవైపు మీదపడిన పెట్టుబడులు
- ఏం చేయాలో తోచక అన్నదాతల ఆందోళన

ముమ్మిడివరం, జనవరి 21: పంటకాల్వ కుదించుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా రైతులు, వ్యవసాయాధికారులకు సూచిస్తున్నా ఆచరణలో అది అమలు కాలేదు. జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్‌లో 1,92,640 ఎకరాల్లో వరిసాగు విస్తీర్ణం ఉండగా ఇప్పటి వరకు నాటు వేసే విధానంలో 2536 ఎకరాల్లో విత్తనం వెదజల్లే విధానం, యంత్రాలతో నాట్లు వేసే విధానంలో 77770 ఎకరాల్లో సాగు జరిగింది. అయితే మొత్తం ఇప్పటి వరకు 1,02,806 ఎకరాల్లో వరినాట్లు పూర్తి అయినట్లు అంచనా. ఇంకా 89834 ఎకరాల్లో వరినాట్లు పడలేదు. మిచౌంగ్ తుఫాన్ కారణంగా డిసెంబరు 4, 5 తేదీల్లో అధికంగా కురిసిన వర్షాల వల్ల ముంపు సమస్య తలెత్తింది. ముంపునీరు బయటికి పోయే మార్గాలు లేక వరి కోతలకు జాప్యం జరిగింది. దీంతో నారుమడులు వేయడం కూడా ఆలస్యమైంది. డిసెంబరు నెలాఖరు, జనవరి మొదటి వారాల్లో నారుమడులు వేసుకుని రైతులు రబీ సాగుకు సిద్ధమయ్యారు. ఎంటీయూ 3626, ఎంటీయూ 1121 వరి రకాలను సాగు చేపట్టారు. ఎంటీయూ 3621 వరిరకం 135 రోజులకు కోతకు వస్తుంది. ఎంటీయూ 1121 వరిరకం 120 నుంచి 125 రోజులకు కోతకు వస్తుంది. అంటే దాదాపు ఇప్పుడు వేసిన వరినాట్లు మే నెలకుగానీ కోత దశకు చేరుకోవు. దీని వల్ల మూడో పంటగా అపరాల సాగుకు ఏమాత్రం అవకాశం లేకపోగా కాల్వల మరమ్మతులకు కూడా వీలు పడదు. ఖరీఫ్ ధాన్యం సొమ్ములు ఇంకా రైతులకు చేరకపోవడం, కొబ్బరి దిగుబడులు, కొబ్బరి ధర అంతంతమాత్రంగానే ఉండడంతో రైతుల చేతుల్లో సొమ్ములు లేక వ్యవసాయం, సాగుపై అంత ఉత్సాహం చూపడం లేదు. రైతులంతా నిర్లిప్తత, నిస్సహాయతతో ఉండిపోయారు. దీంతో వ్యవసాయ పనులు నత్తనడకన సాగుతున్నాయి.



ధాన్యం సొమ్ము చేతికందలేదు

ధాన్యం అమ్మి నెల అయింది. ఇంకా సొమ్ములు చేతికి అందడం లేదు. ఖరీఫ్‌లో తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు సగం పంట నీటి పాలైంది. మిగతా పంటను అమ్మితే ఇంకా సొమ్ములు రాలేదు. రబీ సాగు ఎలా చేపట్టాలో తెలియడం లేదు. నేను నాలుగు ఎకరాలు సాగు చేస్తున్నాను. ఖరీఫ్‌లో వర్షాలకు చేలు నేలనంటడంతో రూ.లక్షా 20వేలు నష్టపోయాను. మిగిలిన పంటను అమ్మితే సొమ్ములు ఇంకా రాలేదు.

మోటూరి మోహనరావు, క్రాప, రైతు



ప్రభుత్వం ఆదుకోవాలి

ఖరీఫ్‌లో పది ఎకరాలు కౌలుకు సాగు చేశాను. తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు మొత్తం వరిచేలు పడిపోయి పంట నష్టపోయాను. రూ.2 లక్షల 50 వేల వరకు అప్పుల పాలయ్యాను. వ్యవసాయాధికారులు నష్టాలను నమోదు చేసుకుని వెళ్లినా ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం గానీ, ఇన్‌పుట్ సబ్సిడీ కానీ, ఇన్సూరెన్సు గానీ అందలేదు. రబీ సాగుకు చేతిలో చిల్లిగవ్వ లేదు. ఎలా సాగు చేయాలో తెలియడం లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

గుబ్బల వెంకటేశ్వరరావు, సోమిదేవరపాలెం, కౌలురైతు





కొమరగిరిలో ఎండిన పొలం

- దాళ్వాకు ఆదిలోనే సాగునీటి కష్టాలు
- నారుమడులు సిద్ధం.. దమ్ముకు ఆటంకం
- ఆందోళనలో అన్నదాతలు

సాగునీటి కష్టాలు



సిద్ధంచేసిన దాళ్వా నారుమడి

ఐ.పోలవరం, జనవరి 21: కష్టాల సుడిగుండంలో ఉన్న అన్నదాతకు రబీ ప్రారంభంలోనే సాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. నారు సిద్ధంగా ఉన్నా సాగునీరు అందకపోవడంతో వరినాట్లు వేసేందుకు వీలుగాని పరిస్థితి ఏర్పడింది. తుఫాన్ ప్రభావంతో తొలకరి పంట నీట మునిగి ఆర్థిక నష్టాల్లో ఉన్న రైతులకు రెండో పంటకు సాగునీటి కష్టాలు తోడై గోరుచుట్టుపై రోకటి పోటులా మారి ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇప్పుడే సాగునీటి పరిస్థితి ఇలా ఉంటే ముందు ముందు ఎలా ఉంటుందోనన్న బెంగ రైతులను వెంటాడుతోంది. మండలంలోని కొమరగిరి, మురమళ్ల తదితర గ్రామాలకు సంబంధించి సుమారు 600 ఎకరాల్లో పొలాలకు నీరు లేక దమ్ములకు ఆటంకం కలిగిందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుఫాన్ కారణంగా తొలకరి కోతలు ఆలస్యం కావడంతో సకాలంలో రెండో పంట సాగు చేపట్టలేకపోయామన్నారు. అయినప్పటికీ ఎన్నో కష్టనష్టాల కోర్చి దాళ్వా నారు సిద్ధం చేసుకున్నామన్నారు. సాగునీటి కొరతతో తమ శ్రమ వృథా అయినట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. సమస్యను ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. దాళ్వాకు పూర్తి స్థాయిలో నీరివ్వకపోతే తీవ్రంగా నష్టపోతామని రైతులు అంటున్నారు. విత్తనాలు చల్లు విధానంలో సాగు చేసిన పొలాలు సైతం నీరు లేక ఎండిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. సాగునీటి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

కోడి కత్తి శ్రీనును విడుదల చేయాలని

దళిత సంఘాల ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న దళిత, ప్రజా సంఘాలు

అమలాపురం టౌన్, జనవరి 21: దళిత యువకుడు జనిపెల్ల శ్రీనివాస్ అలియాస్ కోడికత్తి శ్రీను కేసులో సీఎం జగన్ కోర్టుకు వచ్చి వాంగ్మూలం ఇచ్చి శ్రీనుకు బెయిల్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండు చేస్తూ దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఐదేళ్లుగా సీఎం జగన్ కోర్టుకు హాజరు కాకుండా కోడికత్తి కేసులో దళిత యువకుడు శ్రీను పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. హంతకుడైన ఎమ్మెల్సీ అనంతబాబుకు బెయిల్ వచ్చేలా చేసుకున్నారని విమర్శించారు. కోడికత్తి శ్రీను జైలులో మగ్గుతుంటే వృద్ధురాలైన తల్లి దీక్షకు దిగితే సీఎం జగన్ కనీసం మానవతా దృక్పథాన్ని చాటుకోకపోవడం శోచనీయమని విమర్శించారు. జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ కోడికత్తి కేసులో ఎటువంటి కుట్రకోణం లేదని తేల్చి చెప్పినప్పటికీ శ్రీనుకు బెయిల్ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. శ్రీను కుటుంబానికి న్యాయం జరగని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆయా సంఘాల నాయకులు డీబీ లోక్, జంగా బాబూరావు, ఇసుకపట్ల రఘుబాబు, రేవు తిరుపతిరావు, బొంతు రమణ, సాపే బాలరవి, డేవిడ్ అంబేడ్కర్, ముత్తాబత్తుల శ్రీను, వాకపల్లి హరీష్ తదితరులు పాల్గొన్నారు.



కళా నీరాజనం

వాటర్ కలర్స్‌తో ప్రత్యేక చిత్రాన్ని రూపొందించిన అంజి ఆకొండి

కాట్రేనికోన, జనవరి 21: అయోధ్యలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ జరగనున్న నేపథ్యంలో కాట్రేనికోనకు చెందిన ప్రముఖ చిత్రకారుడు అంజి ఆకొండి కళా నీరాజనాలు అర్పించారు. ఆంజనేయస్వామి తమ గురుదేవుడు రామచంద్రుని సతీ సమేతంగా తోడ్కొనిరావడం, ఇంద్రాది ముక్కోటి దేవతలు పూల వర్షం కురిపిస్తుండగా అశేష భక్త సందోహం జైశ్రీరామ్ నినాదాలతో మారుమోగుతున్న సందర్భాన్ని చిత్రించారు. వాటర్ కలర్స్‌తో గీసిన ఈ చిత్రాన్ని అయోధ్య రాముని పాద పద్మాలకు అంకితం చేశారు.

6 గంటలు నిర్బంధం

అంబాజీపేట పోలీస్‌స్టేషన్‌లో అంగన్‌వాడీలు

అంబాజీపేట, జనవరి 21: తమ డిమాండ్ల సాధన కోసం చలో విజయవాడ కార్యక్రమానికి తరలివెళ్తున్న అంగన్‌వాడీ వర్కర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని మాచవరం సెక్టారుకు చెందిన 23 మంది అంగన్‌వాడీ వర్కర్లను ముందస్తుగా ఎస్ఐ ఏ.చైతన్యకుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాత్రి 10 గంటల వరకూ పోలీస్‌స్టేషన్ బయట అంగన్‌వాడీలను ఉంచడంతో విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. న్యాయమైన డిమాండ్ల కోసం పోరాటం చేస్తుంటే అక్రమంగా అరెస్టులు చేసి అర్ధరాత్రి వరకూ పోలీస్‌స్టేషన్‌లో ఉంచడం దారుణమని టీడీపీ నాయకులు మండిపడ్డారు. అదుపులోకి తీసుకున్న మహిళలను తక్షణం వదలిపెట్టాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్ఐ ఏ.చైతన్యకుమార్‌తో టీడీపీ నాయకులు దాసరి వీరవెంకట సత్యనారాయణ, అరిగెల నాని, కొప్పిసెట్టి ఈశ్వరరావు, మట్టా నాగేంద్ర, తదితరులు చర్చలు జరిపారు. దీంతో ఎస్ఐ ఏ.చైతన్యకుమార్ వ్యక్తిగత పూచీకత్తుపై అంగన్‌వాడీలను వదలిపెట్టారు. పోలీసుల కళ్లుకప్పి విజయవాడ వెళితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



పోలీస్‌స్టేషన్‌లో అంగన్‌వాడీలు



మోతుగూడెం రహదారులపై కమ్మేసిన పొగ మంచు

మంచు ముసుగు..

మోతుగూడెం, జనవరి 21: చింతూరు మండలం మోతుగూడెం మన్యంలో ఉదయం సాయంత్రం వేళలో దట్టంగా పొగమంచు కురుస్తోంది. ఉదయం 10గంటల వరకు భానుడు కనిపించడంలేదు. ఎదు రుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో వాహనాలు లైట్లు వెలుగులో రాకపోకలు సాగించారు. కొంతమంది ప్రకృతి ప్రేమికులు ఈ దృశ్యాలు సెల్‌ఫోన్‌లో బంధించారు.

31న ఆదికవి నన్నయ వర్శిటీ స్నాతకోత్సవం

- గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా పట్టాల ప్రదానం
- పద్మశ్రీ సుధామూర్తికి గౌరవ డాక్టరేట్

రాజానగరం, జనవరి 21: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 13, 14, 15 స్నాతకోత్సవ వేడుకలను ఈనెల 31న నిర్వహించ నున్నట్టు వీసీ ఆచార్య కె.పద్మరాజు ఆదివారం తెలిపారు. ఇందు కు సంబంధించిన ఏర్పాట్లను చురుగ్గా జరుగుతున్నాయన్నారు. నన్నయ వర్శిటీ.. తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు, మన్యం(సగభాగం)జిల్లాల్లోని 390 అనుబంధ కళాశాలలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే అతిపెద్ద విశ్వ విద్యాలయంగా ఆవిర్భవించిందన్నారు. 31వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు వర్శిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో స్నాతకో త్సవం ప్రారంభమవుతుందన్నారు. దీనిలో భాగంగా 2019-20, 2020-21, 2021-22 విద్యా సంవత్సరానికి చెందిన పీహెచ్‌డీ, పీజీ, పీజీ డిప్లమో, యూజీ అండ్ పీజీ ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసిన వారికి పట్టాలు అందజేయనున్నారు. 13, 14, 15 స్నాతకోత్సవానికి వివిధ కోర్సులకు చెందిన 500 మంది విద్యార్థులు అప్లై చేసుకోగా, వీరిలో పీహెచ్‌డీ 12, గోల్డ్‌మెడల్స్ 12, ప్రైజ్ 12, మిగిలిన వారు పీజీ కోర్సులు ఎంఏ, ఎంకామ్, ఎంబీఏ, ఎల్ఎల్ఎం, ఎంఎస్సీ, ఎంసీఏ, ఎంఈడీ, ఎల్ఎల్‌బీ, బీఈడీ కోర్సులు పూర్తిచేసిన వారున్నారు. వీరందరికీ గవర్నర్ అబ్దుల్‌నజీర్ చేతుల మీదుగా పట్టాలు ప్రదానం చేయనున్నారు. మరో ముఖ్యఅతిథి భారతీయ సంఘ సేవ కురాలు, రచయిత్రి, కంప్యూటర్ ఇంజనీర్, పద్మశ్రీ సుధామూర్తికి గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నారు. స్నాతకోత్సవాన్ని పండుగలా నిర్వహించేందుకు వర్శిటీ అధ్యాపకులు, అందరూ సహకరించాలని ఈ సందర్భంగా వీసీ కోరారు.

'నన్నయ' స్నాతకోత్సవానికి గవర్నర్‌కు ఆహ్వానం



గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న వీసీ పద్మరాజు

ఆదికవి నన్నయ విశ్వవిద్యా లయంలో ఈనెల 31న జరుగనున్న స్నాతకోత్సవానికి విధిగా రావాలంటూ వర్శిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు ఆదివారం గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఆహ్వానించారు. ఈమేరకు గవర్నర్ కార్యాలయంలో అబ్దుల్ నజీర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానించారు. నన్నయ వర్శిటీలో స్నాతకోత్సవానికి విచ్చేసి విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేయాలని ఈ సందర్భంగా కోరినట్టు వీసీ తెలిపారు.



ఈవో రామచంద్రమోహన్‌కు విరాళం అందజేస్తున్న దాత శివకుమార్

సత్యదేవుడి సన్నిధిలో
శివసదన్ కాటేజీకి రూ.20 లక్షల విరాళం

అన్నవరం, జనవరి 21: అన్నవరం దేవస్థానంలో సత్యగిరికొండపై నిర్మించిన శివసదన్ కాటేజీలో డోనార్‌స్కీం ద్వారా ఒక దాత రెండుగదులకు రూ.20 లక్షలు విరాళంగా సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన ఎస్.శివకుమార్ ఈ మొత్తాన్ని ఆలయ ఈవో రామచంద్రమోహన్‌కు అందజేశారు. రెండు గదులను చెట్టుపల్లి అప్పారావు, చెట్టుపల్లి పుష్ప అప్పారావు పేరున దాత చెల్లించారు. ఈ సందర్భంగా దాతను ఈవో అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించారు.

అమ్మ కరుణ కోసం బడిత పూజ

- ఎగబడిన భక్తులు
- నాగదేవతకు భక్తి శ్రద్ధలతో పూజలు
- దేవతామూర్తుల వేషధారణలతో ఇంద్రలోకాన్ని తలపించిన కొప్పవరం
- వైభవంగా సత్తెమ్మ జాతర ఉత్సవాలు



అమ్మ కరుణ కోసం పూజారులతో బడిత పూజ చేయించుకుంటున్న భక్తులు

అనపర్తి, జనవరి 21: అనపర్తి మండలం కొప్పవరం గ్రామంలోని కర్రి వారి సతెమ్మతల్లి జాతర ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. తమ గ్రా మానికి వచ్చిన అమ్మవారు పుట్టవద్దకు వెళ్లి అంతర్ధానమైందని అక్కడ నాగ దేవతగా అవతరించిందని ఇక్కడ భక్తుల నమ్మకం. ఈ ఆచారం ప్రకారం విచిత్ర వేషాలు దరించిన భక్తులు గ్రామ పొలిమేరలోని పాములపుట్ట వద్దకు చేరుకుని నాగదేవతకు పాలుపోసి పూజలు నిర్వహించారు. రెండేళ్ల క్రితం జరిగిన జాతరలో అమ్మవారికి మొక్కుకుని సంతానం పొందిన మహిళలు తమ చిన్నారులకు వేషాలు వేయించి పుట్ట వద్దకు తీసుకువచ్చి పూజలు చేశారు. పుట్ట వద్దకు వెళ్లే రహదారి అంతా విచిత్ర వేషధారులతో నిండిపోయింది. అనంతరం భక్తులంతా ఊరేగింపుగా అమ్మవారి ఆలయంవద్దకు చేరుకుని పూజారితో బడిత పూజకు సిద్ధమయ్యారు. ఆలయం ప్రాంగణానికి చేరుకున్న విచిత్ర వేషాల్లో ఉన్న భక్తులు పూజారి బయటకువచ్చి తమను ఆశీర్వదించాలని కేకలు వేయడంతో పూజారులు చేతిలో బడిత పట్టుకుని భక్తుల వద్దకు వచ్చారు. ఇలా వచ్చిన పూజారులను భక్తులు అల్లరిచేసి కోపం రప్పించడంతో ఆగ్రహించిన పూజారులు బడితలతో భక్తులను కొట్టడం ప్రారంభించారు. బడిత పూజ చేయించుకుంటే అమ్మ తమను కరుణిస్తుందని భక్తుల విశ్వాసం. పుట్ట వద్దకు వెళ్లేందుకు రకరకాల వేషాలు ధరించిన భక్తులు మోటారుసైకిళ్లపై తిరుగుతుండడంతో ఊరంతా కొత్త వాతావరణం ఏర్పడింది. కోయదొరలు, శక్తివేషాలు, పురుషులు మహిళలుగాను, చిన్నారులు ఈశ్వరుడు, శ్రీకృష్ణుడు అనేక రకాల వేషాలతో ఆకట్టుకున్నారు.



దర్శనానికి వచ్చిన గోల్డ్‌మేన్, అమ్మ కరుణతో పుట్టిన చిన్నారి చిన్న కారులో వచ్చిన దృశ్యం



నాగదేవతకు పుట్టలో పాలు పోసి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మొక్కులు చెల్లించేందుకు నేడు భక్తుల భిక్షాటన

సత్తెమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకునే భక్తులు సోమవారం జరిగే జాతరలో విచిత్ర వేషాలు ధరించి భిక్షాటన చేసేందుకు సిద్ధమయ్యారు. తమ దగ్గర ఉన్న తులమో పళమో అమ్మవారికి సమర్పించుకోవడం ఇక్కడ నిషేధం కాబట్టి మొక్కులు తీర్చుకునే భక్తులు జాతరలో విచిత్ర వేషం ధరించి భిక్షాటన చేయాల్సిందే.. ఇలా వచ్చిన మొత్తాన్ని అమ్మకు చెల్లిస్తేనే మొక్కు తీరుతుంది.

తలుపులమ్మా.. కరుణించమ్మా..

- భక్తులతో పోటెత్తిన లోవ
- ఆలయానికి రూ.4.98 లక్షల ఆదాయం

తుని రూరల్, జనవరి 21: కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానం ఆదివారం భక్తులతో పోటెత్తింది. తెలుగురాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. వేకువజామునే అమ్మవారికి ప్రత్యేక అలంకరణ అనంతరం పూజలు నిర్వహించి పండితులు దర్శనభాగ్యం కల్పించారు. ప్రత్యేక క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం తరలివచ్చిన భక్తుల నుంచి వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.4.98లక్షలు ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో విశ్వనాధ రాజు తెలిపారు.





భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ అమ్మవారు, ఆలయ ప్రాంగణంలో వంటావార్పు చేసుకుంటున్న భక్తులు

రెండోరోజు కొనసాగిన
లాన్‌టెన్నిస్ పోటీలు



పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు పరిచయం చేసుకుంటున్న ఏడీ రాజశేఖర్

కాకినాడరూరల్, జనవరి 21: కాకినాడలో 67వ జాతీయస్థాయి బాలుర లాన్ టెన్నిస్ పోటీలు రెండో రోజు ఆదివారం ఉత్సాహంగా కొనసాగాయి. 19 సంవత్సరాలలోపు బాలురకు నిర్వహిస్తున్న ఈపోటీలు ఈనెల 24వరకూ కొనసాగనున్నాయని ఆర్జేడీ జి.నాగమణి తెలిపారు. పోటీలు డీఎస్ఏ, డీమార్ట్ సమీపంలోగల స్మార్ట్‌సిటీ టెన్నిస్‌క్లబ్, ఎస్పీ కార్యాలయం వెనుకగల టెన్నిస్ మైదానంలోనూ జరిగాయి. ఆదివారం మొత్తం 9మ్యాచ్‌లు నిర్వహించగా మహారాష్ట్ర, కేంద్రీయ విద్యాలయం జట్లమధ్య జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో మహారాష్ట్ర జట్టు 2-1 స్కోర్‌తేడాతో విజయం సాధించింది. అదేవిధంగా హర్యానా జట్టు తెలంగాణా జట్టుపై 2-0తో విజయం సాధించింది. ఢిల్లీజట్టు రాజస్థాన్‌పై 2-0తేడాతోనూ, ఏపీజట్టుపై గుజరాత్‌జట్టు 2-0తేడాతోనూ విజయం గెలుపొందింది. హర్యానాజట్టు మహారాష్ట్రపై 2-1స్కోర్‌తేడాతో విజయం సాధించిందని తెలిపారు. పోటీలను ఎస్‌జీఎఫ్ రాష్ట్ర ఛైర్మన్ జి.భానుమూర్తిరాజు, ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి టీవీవీఎస్‌వీ ప్రసాద్, అఫీషియల్స్ కె.శ్రీకుమార్, డీవైఈవోలు డేనియల్‌రాజు, సుభద్ర, డీఎస్‌డీవో బి.శ్రీనివాస్‌కుమార్, ఎంఈవోలు రవి, ఏసుదాసు, శివప్రసాద్, పులయ్య, ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు రంగారావు, పీడీలు రవిరాజు, బంగార్రాజు, నూకరాజు, శ్రీనివాస్, పట్టాభి, మాసరరావు పర్యవేక్షిస్తున్నారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు



రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు



జాతీయ పోటీలకు 30మంది క్రీడాకారుల ఎంపిక

పిఠాపురం, జనవరి 21: పిఠాపురం పట్టణంలోని పాతబస్టాండ్ మునిసిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు ఆదివారం ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. ఫ్రీస్టైల్, గ్రేకో రోమన్ తదితర విభాగాల్లో జరిగిన ఈ పోటీలకు రాష్ట్రంలోని 16 జిల్లాలు నుంచి 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పురుషులు, మహిళల విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో ప్రతిభ చూపిన 30మంది క్రీడాకారులను జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక చేశారు. ఈనెల 30, 31వ తేదీల్లో మహారాష్ట్రలోని పూణేలో జరిగే జాతీయ పోటీలకు వీరు రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తారు. పోటీల్లో విజేతలకు అధికారులు, ప్రజాప్రతినిధులు బహుమతులు, మెడల్స్ అందజేశారు. పోటీలను జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు గు బ్బల ఎలీషా పర్యవేక్షించగా ఒలింపిక్ అసోసియేషన్ సీఈవో చంద్రు గోవింద రాజులు, ఒలింపియన్ ఎంవీ మాణిక్యాలరావు, పిఠాపురం మునిసిపల్ కమిషనర్ కృష్ణవేణి, సత్యనారాయణరెడ్డి, డీఎస్‌డీవో బి.మాణిక్యాలరావు, మునిసిపల్ వైస్‌ఛైర్మన్ కొత్తపల్లి పద్మబుజ్జి పాల్గొన్నారు.

పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల దారి మళ్లింపు



సామర్లకోట, జనవరి 21: విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో ట్రాక్ కారిడార్ పనులు నిర్వహిస్తున్న దృష్ట్యా ఈనెల 29 నుంచి విజయవాడ-విశాఖ మధ్య రాకపోకలు సాగించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను దారి మళ్లించినట్లు రైల్వే ఏటీఎం చార్జి ఏ.సురేష్‌రెడ్డి సామర్లకోట రైల్వేస్టేషన్ అధికారులకు సమాచారం అందించారు. ఆంధ్రజ్యోతి సదరు సమాచారాన్ని ఆదివారం రాత్రి సేకరించింది. నెం.13351 ధన్‌బాద్-అలెప్పీల మధ్య నడిచే బొకారో ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 29నుంచి ఫిబ్రవరి 25 వరకూ నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడ చేరుతుంది. నెం.12835 హతియా-బెంగుళూరుల మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 30న, ఫిబ్రవరి 4,6,11,13,18,20,25 తేదీల్లో నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడ చేరుతుంది. నెం.18637 హతియా-బెంగళూరు మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు ఫిబ్రవరి 3,10,17,24 తేదీల్లో నిడదవోలు, భీమవరం, గుడివాడ మీదుగా విజయవాడకు చేరుతుంది. నెం.22837 హటియా-ఎర్నాకుళం మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 29, ఫిబ్రవరి 5,12,19 తేదీల్లో నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడకు చేరుతుంది. నెం.18111 టాటా-యశ్వంత్‌పూర్ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు ఫిబ్రవరి 1,8,15,22 తేదీల్లో నిడద వోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడకు చేరుతుంది. నెం.12756 భావనగర్-కాకినాడ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు ఫిబ్రవరి 3,10,12,19 తేదీల్లో విజయవాడ, గుడివాడ, భీమవరంటౌన్ మీదుగా నిడదవోలు చేరుతుంది. నెం.12509 బెంగుళూరు-గౌహతి మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 31, ఫిబ్రవరి 2,7,9,14,16,21,23 తేదీల్లో విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్‌ల మీదుగా నిడదవోలు చేరుతుంది. నెం.11019 ముంబాయి-భువనేశ్వర్‌ల మధ్య నడిచే కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 29,31, ఫిబ్రవరి 2,3,5,7,9,10,12,14,16,17,19,21,23,24 తేదీల్లో విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్ మీదుగా నిడదవోలు చేరుతుంది. వివరాలకు సమీపంలోని రైల్వేస్టేషన్ బుకింగ్ కార్యాలయ సిబ్బంది ద్వారా సమాచారాన్ని తెలుసుకోవచ్చని సీనియర్ ఏటీఎం చార్జి ఏ.సురేష్ రెడ్డి తెలిపారు.

పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం

రాజోలు, జనవరి 21: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు జిల్లా ప్రజా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మొదటి బ్యాచ్‌కు చెందిన పూర్వపు విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం రాజోలు యూత్ క్లబ్ ఆవరణలో జరిగింది. 1969లో ఎస్ఎస్‌సీ మొదటి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు బందా సూర్యనారా యణ చొరవతో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసు కున్నారు. పూర్వ విద్యార్థి కోళ్ల వెంకన్న మాట్లాడుతూ ఆరేళ్లుగా స్నేహితులందరూ కలుసుకుంటున్నామన్నారు. పూర్వ విద్యార్థులకు బిళ్లకోట సోమేశ్వరరావు ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. కార్యక్ర మంలో నయినాల సీతారామారావు, సూతాపల్లి అచ్యుత రామ నాగేశ్వరరావు, ఎస్.మాధవరావు, ఎం.మోహనరావు, అంగర సత్యనారాయణ, టీవీఎస్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రాజోలులో కలుసుకున్న 1969 నాటి పదో తరగతి విద్యార్థులు

రౌతులపూడిలో
యానాం మద్యం పట్టివేత



పోలీసులు పట్టుకున్న మద్యం సీసాలు

రౌతులపూడి, జనవరి 21: కాకినాడజిల్లా రౌతులపూడిలో పోలీస్‌లు అక్రమంగా నిల్వఉంచినయానాం మద్యం పట్టుకున్నారు. రౌతులపూడి ఎస్ఐ అబ్దుల్ నబీ తెలిపిన వివరాలు ప్రకారం.. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు వచ్చిన సమాచారం మేరకు... పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి ఆదేశాలతో ఒక వ్యక్తి నుంచి 192 బీర్లు, 180 ఎమ్ఎల్ విస్కీ 129 సీసాలు, 375 ఎమ్ఎల్ విస్కీ 45 సీసాలు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్టు తెలిపారు. అలాగే రౌతులపూడి వంతెనపై 30 లీటర్లు సారాతో వ్యక్తిని అరెస్టు చేసినట్టు తెలిపారు.

వైసీపీ నాయకుల జేబులు నింపేందుకే
ఇసుక ర్యాంపుల్లో అనధికార వసూళ్లు

- మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు
- రెండోరోజు లారీ అసోసియేషన్ సభ్యుల నిరసన

రావులపాలెం, జనవరి 21: ఇసుక ర్యాంపులో అనధికారకంగా చేస్తున్న వసూళ్లు వైసీపీ నాయకుల జేబులు నింపేందుకా అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. గోపాలపురం ఇసుక ర్యాంపులో ఉభయగోదావరిజిల్లాల లారీ అసోషియేషన్ సభ్యులు రెండో రోజు కార్యక్రమం ఆదివారం కొనసాగించారు. ట్రాక్టర్‌కు రూ.500, ఆరు టైర్ల లారీకి రూ.1000, పది టైర్ల లారీకి రూ.1500, పన్నెండు టైర్ల లారీకి రూ.2000వంతున ఇసుక ర్యాంపుల్లో అక్రమ వసూళ్లు చేస్తుండటంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామంటూ లారీ అసోషియేషన్ సభ్యులు నిరసన చేపట్టారు. గోపాలపురం ఇసుక ర్యాంపులో చేపట్టిన నిరసనలో భాగంగా వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, టీడీపీ రాష్ట్రతెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ టీడీపీ నాయకులతో కలిసి అక్కడికి వెళ్లిసంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల లారీ అసోషియేషన్‌కు టీడీపీ అండగా ఉండి దోపిడీ అడ్డుకుంటామన్నారు. ర్యాంపులో ఇసుక లారీ ఓనర్స్ దగ్గర బాటచార్జీల పేరుతో వైసీపీ రౌడీమామూళ్లు అని ప్రశ్నించారు. అనధికారిక వసూళ్లు వైసీపీ నాయకులు జేబులు నింపేందుకే అన్నారు. చట్టపరమైన, కనీసం పర్యావరణ అనుమతులు కూడా లేకుండా అక్రమంగా ఇసుక తవ్వడం దారుణమన్నారు. అంతేకాకుండా బాట చార్జీలపేరుతో వైసీపీ వసూళ్ల పథకాన్ని ప్రవేశపెట్టి దండుకుంటుందన్నారు. ఈ ఇసుకాసురుల ఆగడాలను లారీ ఓనర్స్ అసోషియేషన్స్‌తో కలిసి ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు, నాయకులు అధికారి నాగు, గుత్తుల పట్టాభిరామారావు, కంఠంశెట్టి శ్రీనివాస్, ధర్నాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



లారీ అసోసియేషన్ సభ్యుల నిరసనకు బండారు సంఘీభావం

మేడివాయిలో
పెట్రోల్ బంకు కూల్చివేత

- ఆ భూమిపై గతంలో ఎల్టీఆర్ కేసు.. రెండు సార్లు నోటీసులు
- ఖాతరు చేయకుండా నిర్మాణ పనులు
- కలెక్టర్ ఆదేశాలతో కూల్చివేసిన రెవెన్యూ అధికారులు



బంకు నిర్మాణ పనులను కూల్చివేస్తున్న దృశ్యం

ఎటపాక, జనవరి 21 మండల కేంద్రమైన ఎటపాక సమీపంలోని మేడివాయిలో అక్రమంగా నిర్మాణం చేపడుతున్న పెట్రోలు బంకు కట్టడాలను శనివారంరాత్రి రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు బంకు నిర్మాణాలను కూల్చి వేశారు. ఈ భూమిపై గతంలో ఎల్టీఆర్ కేసు నమోదై ఉందని, తహసీల్దార్ పృథ్వీ తెలిపారు. ఎల్టీఆర్ ఉండగా ఎలాంటి నిర్మాణాల పనులు చేపట్టకూడదని గతంలో హెచ్చరించామని తెలిపారు. ఇటీవల భూమిపై అన్ని అనుమతులు ఉన్నాయని చెప్పుకొంటున్న ఓ వ్యక్తి ఎల్టీఆర్ ఖాతరు చేయకుండా బంకు నిర్మాణ పనులుచేస్తూ ఉండ డంతో రెవెన్యూ అధికారులు గత అక్టోబరులో, ఈనెల 2 తేదీన ఆ వ్యక్తికి నోటీసు అందజేశారు. అయినా లెక్కచేయకుండా నిర్మాణ పనులు కొనసాగిస్తూ ఉండ డంతో కలెక్టర్ ఆదేశాలతో కట్టడాలపై చర్యలు తీసుకున్నారు. బంకు నిర్మాణం చేపడుతున్న వ్యక్తి ఈభూమిపై జీవో తెచ్చుకున్నారని, ఆ జీవోను న్యాయ స్థానంలో సవాలు చేయగా రద్దు చేసి ఆర్డీవో స్వాధీనం చేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసిందని తహసీల్దార్ తెలిపారు. ఏజెన్సీలో ఉన్నటువంటి ఈ భూమిపై గిరిజనేతరులు చెల్లని డాక్యుమెంట్లతో మ్యూటేషన్ చేయించుకున్నారని, అవి చెల్లదని దాంతో నిర్మాణాలను కూల్చివేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

- మృతుడు కాకినాడ వాసి



ఉదయ్‌కుమార్ (ఫైల్)

అచ్యుతాపురం రూరల్, జనవరి 21: అచ్యుతాపురం మండలంలోని ఆవసోమవరం శివారు పిల్లోడుపాలెం సమీపంలో గల చెరువుగట్టు వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కాకినాడజిల్లా జగన్నాథపురంలోని రిక్షా వీధికి చెందిన కాకి ఉదయ్‌కుమార్(20) రెండు రోజుల క్రితం చోడపల్లిలోని తన చెల్లి, బావ ఇంటికి వచ్చాడు. అక్కడ ఆనందంగా గడిపి ఆదివారం ఉదయం సమీపంలోని పిల్లోడిపాలెంలో గల బంధువుల ఇంటికి వెళుతున్నానని చెప్పి బయలు దేరాడు. అయితే అక్కడికి సమీపంలోని చెరువు వద్ద తన ద్విచక్ర వాహనాన్ని ఆపి అక్కడేఉన్న చెట్టుకు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసు కున్నాడు. గ్రామస్థులు సమా చారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి వచ్చి మృతుని జేబులో ఉన్న అడ్రస్ కాగితం ఆధారంగా అతని వివరాలు తెలుసుకుని బంధువులకు సమాచారం ఇచ్చారు. అతను ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు.

తేటగుంట శివాలయంలో దొంగల బీభత్సం

- హుండీల్లో నగదు, బంగారు ఆభరణాల చోరీ



దుండగులు దొంగలించిన హుండీ, ధ్వంసం చేసిన సీసీ కెమెరాల కిట్టు

తునిరూరల్, జనవరి 21: వరుస దొంగతనాలతో దుండగులు హడలెత్తిస్తున్నారు. ఏడాది కాలంలో జాతీయ రహదారి వెంబడి ఉన్న తేటగుంట గ్రామంలో పలు ఆలయాల్లో దేవతామూర్తుల బంగారం, వెండి ఆభరణాలు, హుండీల చోరీ ఘటనలు మరువక ముందే ఆదివారంరాత్రి దుండగులు ఆలయాల్లో బీభత్సం సృష్టించారు. మెట్టలో ప్రసిద్ధి ఆలయమైన తేటగుంట శివాలయంలో దుండగులు చొరబడ్డారు. ఆలయ ద్వారాలకు ఉన్న తాళాలు పగలకొట్టి గుడిలోకి ప్రవేశించి సీసీ కెమెరాలు, విద్యుత్ లైట్లు ధ్వంసం చేశారు. అనంతరం స్వామివారి గర్భగుడి తలుపులను తొలగించి అమ్మవారి మెడలోని మంగళసూత్రం, హుండీలను చోరీ చేశారు. అదేవిధంగా శివాలయం ప్రక్కనే గల సాయిబాబా ఆలయంలో ఈ తరహాలోనే చోరీకి పాల్పడిఅక్కడహుండీలోని నగదును అపహరించారు. దీంతో స్వామి వారి మేలుకొల్పు పూజకు ఆలయాలకు వెళ్లిన అర్చకులు చెల్లా చెదురుగా ఉన్న వస్తువులను చూసి ఖంగుతిన్నారు. దీంతో ఆలయ కమిటీలకు సమాచారం అందించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఇటీవల గ్రామంలో వరుస దొంగతనాలతో ఆలయాలకు రక్షణ కరువైందని రెండేళ్లలో శివాలయంలో మూడుసార్లు ఆలయంలో దొంగలు ప్రవేశించి ఆలయ సంపదను చోరీ చేయడం పట్ల భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు చర్యలు చేపట్టి దొంగలను పట్టుకుని ఆలయాలకు రక్షణ కల్పించాలని ఆలయ కమిటీ సభ్యులు తెలుపుతున్నారు.

తన్విక్‌కు ఆర్థిక సాయం

అంతర్వేది, జనవరి 21: అప్పనరామునిలంక గ్రామానికి చెందిన గుబ్బల సత్యనారాయణ కుమారుడు తన్విక్‌కుమార్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సమకూర్చిన రూ.75వేలనుమాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆదివారం అందించారు. గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎంపీపీ కేతా శ్రీనివాస్, గుబ్బల బాబ్జి, గుబ్బల శ్రీనివాస్, చాగంటి స్వామి, బత్తుల రవీంద్రనాథ్, రాపాక ఆనంద్ కుమార్, దొంగ శ్రీనివాస్, చింతా మనోహర్, నామన మణికంఠ పాల్గొన్నారు.

- అయోధ్య రామమందిరంలో బాలరాముని ప్రతిష్ఠ నేపథ్యంలో రామాలయాలు ముస్తాబు
- పలు చోట్ల అక్షింతలతో శోభాయాత్ర

జయ జయ రామ







ముమ్మిడివరం:రాణేలంక బాడవలో అక్షింతల శోభాయాత్ర, అమలాపురం: నడిపూడిలో శ్రీరాముని అక్షింతలతో శోభాయాత్ర, రామచంద్రపురం: జైశ్రీరామ్ నినాదాలు చేస్తున్న రామభక్తులు

అమలాపురంరూరల్, జనవరి21: అయోధ్య నుంచి తీసుకువచ్చిన అక్షింతలకు నడిపూడిలోని హనుమాన్ ఆలయాల వద్ద భక్తులు ఆదివారం పూజలు నిర్వహించారు. సోమవారం బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించి ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో రంకిరెడ్డి రామ లింగేశ్వరరావు, అరిగెల సుబ్బరాజు, అరిగెల శేషగిరిరావు, అరి గెల రాజారావు, కుంపట్ల నాయుడు తదితరులు పాల్గొన్నారు. కుమార్‌నగర్‌లో శ్రీకల్యాణ కోదండ కోలాట బృందం ఆధ్వర్యంలో రామాలయంలో అక్షింతలకు పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి రామాలయం కమిటీ ఆధ్వర్యంలో అక్షింతలను పంపిణీ చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆలమూరు: సంధిపూడిలో ఆదివారం అయోధ్య అక్షింతలను పంపిణీ చేశారు. రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో సంధిపూడి రామాలయం నుంచి అక్షింతలను పల్లకిలో మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి ఇంటింటికి అందించారు. అక్షింతలతో పాటు రామ మందిర చిత్ర పటాలను అందజేశారు. గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అంబాజీపేట: అయోధ్య శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా మండలంలోని శ్రీరాముని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుగ్రామాల్లో శోభాయాత్ర నిర్వహించారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో శ్రీరాముడిని పల్లకిలో ఊరేగించారు. గంగలకుర్రు అగ్రహారం, మాచవరం గ్రామాల్లో యువకులు జైశ్రీరామ్ అంటూ గోడలపై రాశారు. ప్రతి ఇంటిపై శ్రీరాముని జెండాలను ఎగురవేశారు. సోమవారం పలు ఆలయాల్లో పూజలు నిర్వహించి అన్నసమారాధన నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

పి.గన్నవరం: అయోధ్య శ్రీరాముని పూజిత పవిత్ర అక్షింతలు లంకలగన్నవరం శివారు వేమనవారిపాలెంలో ఆదివారం ఊరేగించారు. గ్రామంలోని ఇంటింటికి అక్షింతలను అందించారు. కార్యక్రమంలో గనిశెట్టి ఈశ్వర్, వేమన రామకృష్ణ, సుభాష్, యువత పాల్గొన్నారు. అయోధ్య శ్రీరామ జన్మభూమిలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో గ్రామాల్లో రామాలయాలను అందంగాముస్తాబు చేస్తున్నారు. నాగుల్లంకలో రామభక్తులు, మహిళలు రామాలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి ముస్తాబుచేశారు. ప్రతిష్ఠ రోజున శ్రీరాముడికి పూజలు నిర్వహించి అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు.

మండపేట: మండపేట చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాళ్లకూరి నాగబాబు ఆధ్వర్యంలో పట్టణంలోని వ్యాపార సంస్థలకు రాములు వారి కాషాయ జెండాలను పంపిణీ చేశారు. అయోధ్య రామమందిరంలో రాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా జెండాలు పంపిణీ చేయడం హర్షణీయమని మండపేటకు చెందిన ప్రముఖుడు రెడ్డి రాజబాబు అన్నారు. ఆలయాలు, వ్యాపారసంస్థలు వద్ద కాషాయ జెండాలను ఎగురవేశారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అంతర్వేది: అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా సఖినేటిపల్లి, మలికిపురం మండలాల్లో సోమవారం శోభాయాత్ర నిర్వహిస్తున్నట్టు వర్తక, వ్యాపార సంస్థ సభ్యులు తెలిపారు. అంతర్వేది, కేశవదాసుపాలెం, రామేశ్వరం, గొంది, సఖినేటిపల్లి, మోరి, వీవీమెరక గ్రామాల్లో రామాలయాలను ప్రత్యేక కాషాయ రంగుతో ఉన్న జెండాలతో అలంకరించారు.

ముమ్మిడివరం: రాణేలంక బాడవలో ఆదివారం అయోధ్య నుంచి వచ్చిన శ్రీరామ పూజిత అక్షింతల శోభాయాత్ర నిర్వహించారు. గ్రామంలో భక్తులు ర్యాలీ నిర్వహించి ఇంటింటికీ అక్షింతలను పంపిణీ చేశారు. సోమవారం అయోధ్య రామమందిర ప్రారంభోత్సవం సందర్భంగా మండలంలోని శ్రీరామాలయాలను శుద్ధిచేసి అలంకరించారు. పలుచోట్ల ఆలయాల వద్ద అన్నసమారాధనలు, భజనా కార్యక్రమాల నిర్వహణకు ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

రామచంద్రపురం: స్థానిక రాజగోపాల్ సెంటర్‌లో ఆదివారం రామచంద్రపురం మొబైల్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రామ భక్తులు జైశ్రీరామ్ నినాదాలతో హోరెత్తించారు. ఈసందర్భంగా సంఘ గౌరవాధ్యక్షుడు కంచుమర్తి బాబూరావు మాట్లాడుతూ బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ పురస్కరించుకుని పట్టణంలోని ప్రతి షాపునకు శ్రీరాముని జెండాను కట్టాలని సూచించారు. అధ్యక్షుడు గంగరాజు వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు భార్గవరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజా, కోశాధికారి నాగేశ్వరరావు, ఎస్వీఆర్ రెడ్డి, రాంబాబు, సురేష, జియో రాజు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: అయోధ్యలో రామమందిరం ప్రాణప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా గ్రామాల్లో శ్రీరామ నామ సందడి నెలకొంది. ప్రతి ఇంటి గోడలపై శ్రీరామనామం రూపొందిస్తున్నారు. జైశ్రీరామ్ అనే జెండాలను డాబాలు, ఇంటి కప్పులపై ఎగుర వేస్తున్నారు. ర్యాలి గ్రామంలోని యువకులు, ప్రతి ఇంటి వద్దకు వెళ్లి జై శ్రీరామ్ అనే నామాన్ని రాస్తున్నారు.

రాజధాని లేకుండా చేసిన ఘనుడు జగన్



ఎమ్మెల్యే వేగుళ్లకు హారతులు ఇస్తున్న మహిళలు

మండపేట, జనవరి 21: ఒక్క చాన్స్‌అంటూ వచ్చిన సీఎం జగన్ నెగ్గిన తర్వాత ప్రజల నెత్తిన పన్నుల భారంవేసి, మూడు రాజధానులు పేరిట ఏపీకి రాజధాని లేకుండా చేసిన ఘనుడు జగన్ అని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆరోపించారు. రాష్ట్రంలో పెట్టుబడులు, పరిశ్రమలు ఏర్పాటు లేవన్నారు. గాడి తప్పిన రాష్ట్రంలో పాలనను గాడిలో పెట్టాలంటే టీడీపీ, జనసేన సంకీర్ణ ప్రభుత్వానికే సాధ్యమన్నారు. అర్తమూరులో ఆదివారం నిర్వహించిన బాబుష్యూరిటీ భవి ష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో వేగుళ్ల మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేనపార్టీలను గెలిపించివైసీపీని చిత్తుగా ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. టీడీపీ నేతలు గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, చిర్ల రామన్న కాపు, ఉపసర్పంచ్ కర్రి సత్యనారాయణరెడ్డి (జంబయ్య), చిర్ల వెంకటరెడ్డి, తాడి శేషారెడ్డి, పడాల రామకృష్ణారెడ్డి, చిర్ల చంద్రారెడ్డి, కాకర శ్రీను, టీడీపీ, జనసేననాయకులు పాల్గొన్నారు.

మూలస్థానంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు



టీడీపీలో చేరిన నాయకులకు కండువా వేస్తున్న బండారు

ఆలమూరు, జనవరి 21: మూలస్థానఅగ్రహారం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నేతలు ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. నాయకులు పామర్తి శ్రీనివాస్, తోట కొండయ్య, బావిశెట్టి రాముడు, రేలంగి అర్జునరావు, జోళ్ల అర్జునరావు, తేరాటి నాగేశ్వరరావు, ఇనపకోళ్ల తరుణ్, పామర్తి రామకృష్ణ, దొండ బుజ్జియ్యలకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. మండల టీడీపీ నాయకులు, మూలస్థానం టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆలమూరు జనసేనలో చేరికలు: ఆలమూరులో ఆదివారం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ అధ్యర్యంలో పలువురు నాయకులు జనసేనలో చేరారు. 50మంది యువకులకు పార్టీ కండువా వేసి శ్రీనివాస్ పార్టీలోకి ఆహ్వానించారు. మండల జనసేన నాయకులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆలయ అభివృద్ధికి ప్రతిపాదనలు



ఆలయంలో పర్యాటక సంస్థ ప్రతినిధులతో స్వామివారి క్షేత్రవివరాలు వివరిస్తున్న చైర్మన్ రమేష్‌రాజు

ఆత్రేయపురం, జనవరి 21: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని అన్నివిధాలా అభివృద్ధి పరిచేందుకు కేంద్ర,రాష్ట్ర పర్యాటక సంస్థ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా పర్యాటక సంస్థ ప్రతినిధులు ఆదివారం ఆలయాన్ని సందర్శించారు. ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందిన ఈక్షేత్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఆర్థికంగా మౌలికపరమైన సహాయ సహకారాలు అందించే చర్యల్లో భాగంగా ఈబృందం క్షుణ్ణంగా పరిశీలించింది. భక్తులకు కల్పించాల్సిన సదుపాయాలు, మౌలిక వసతులు, వ్యర్థాలు ఎలా ఉపయోగించాలనే అంశాలను తెలుసుకున్నారు. చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు ఈబృందానికి వాస్తవ పరిస్థితులను వివరించారు. ఈనెల25న నిర్వహించే పాలక మండలి సమావేశంలో రూ.25కోట్లతో పనులకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు ఈవో సత్యనారాయణరాజు వివరించారు.

కోడి కత్తి సంఘటన నిజమైతే జగన్ సాక్ష్యం చెప్పాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, జనవరి 21: కోడికత్తి కేసు నిజమైతే సీఎం జగన్ బయటకు వచ్చి సాక్ష్యం చెప్పాలని టీడీపీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు డిమాండ్ చేశారు. రాజకీయ కుట్రలో భాగంగానే ఒక దళిత కుటుంబాన్ని బలి చేశారని ఆరోపించారు. తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఆనందరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దళిత బాంధవుడిని చెప్పుకునే జగన్ విశాఖ ఎయిర్‌పోర్టులో కోడికత్తి డ్రామా ఆడించి, 60 నెలలుగా శ్రీనుకు బెయిల్ రాకుండా చేయడం దళితులపై ఆయనకున్న ప్రేమ ఏ మేరకు ఉందో అర్థమవుతుందన్నారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం నిరుపేద దళితుడిని జైలుపాలు చేశారని విమర్శించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ వృద్ధురాలైన శ్రీను తల్లి నిరాహార దీక్ష చేస్తున్నా సీఎం జగన్ చలించకపోవడాన్ని ఏమనాలని ప్రశ్నించారు. ఎన్నో ఆర్థిక నేరాలు చేసి నిందితుడిగా ఉన్న జగన్ స్వేచ్ఛగా తిరుగుతున్నాడన్నారు. కోడికత్తి శ్రీనును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ మాకిరెడ్డి వీఎన్ఎస్ పూర్ణిమ మాట్లాడుతూ ఐదు నిమిషాల పాటు కోర్టుకు వచ్చి సీఎం జగన్ సాక్ష్యం చెప్పాలని శ్రీను తల్లి దీక్షా చేస్తుంటే విద్యుత్ సరఫరా నిలుపుదల చేసి వాష్‌రూమ్‌కు తాళాలువేసి హింసిస్తావా అని ధ్వజమెత్తారు. సమావేశంలో తెలుగు మహిళలు గెల్లా మీనా కుమారి, యనమదల లక్ష్మి, పేరూరి విజయలక్ష్మి, గెద్దాడ సత్యవాణి, అప్పారి సుశీల తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృతజ్ఞతలు

మండపేట, జనవరి 21: మండపేటలో శనివారం జరిగిన రాకదలిరా భారీ బహిరంగ సభను విజయవంతం చేసిన టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు, ప్రజలకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

రైల్వే రిజర్వేషన్ సేవలు అందుబాటులోకి

అమలాపురం టౌన్, జనవరి 21: అమలాపురం ప్రధాన తపాలా కార్యాలయంలో ఆదివారం రోజున కూడా రైల్వే రిజర్వేషన్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. అమలాపురం ఎంపీ చింతా అనురాధ పోస్టల్‌శాఖ ఉన్నతాధికారులకు లేఖ రాసిన నేపథ్యంలో ఈ సేవలను అదనంగా అందుబాటులోకి తీసుకువచ్చారు.

ఘనంగా అన్నసమారాధన

అంతర్వేది, జనవరి 21: అంతర్వేదిలో కనకముత్యాలమ్మ, కనకదుర్గమ్మ అమ్మవార్ల తీర్థమహోత్సవాల్లో భాగంగా ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. 2వేలమంది పాల్గొన్నారు. అమ్మవారి చీరల వేలం పాట నిర్వహించారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



అమలాపురంలో అంగన్‌వాడీల సమ్మె

అమలాపురం టౌన్, జనవరి 21: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలంటూ చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారానికి 41వ రోజుకు చేరుకుంది. కలెక్టరేట్ ఎదుట అమలాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు దీక్షలో పాల్గొన్నారు. ప్రాజెక్టు ప్రతినిధులు కె.బేబీగంగారత్నం, జి.దైవకృప, ఎ.సీత, రత్నకుమారి, పరిపూర్ణ పాల్గొన్నారు.

ముమ్మిడివరం: అంగన్‌వాడీలు దీక్షలు ఆదివారం నాటికి 41వ రోజుకు చేరుకు న్నాయి. ముమ్మిడివరం సీడీపీవో కార్యాలయం ఎదుట ఏర్పాటుచేసిన సమ్మె శిబిరంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు 41వ అంకె కొవ్వొత్తిని వెలిగించి నిరసన తెలిపారు.దీక్షా శిబిరంలో ఎస్.దుర్గామహేశ్వరి, ఎం.జయలక్ష్మి, వి.తలుపులమ్మ, వి.శ్రీదేవి, అరుణకుమారి, సత్యవతి, విజయకుమారి, ఎస్.కనకదుర్గ, సుబ్బలక్ష్మి, నాగరత్నం, కె.వెంకటలక్ష్మి, విజయకుమారి, యశోద, అనంతలక్ష్మి, మంగాయమ్మ తదితరులు పాల్గొన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.

పి.గన్నవరం: అంగన్‌వాడీల నిరవధిక సమ్మెలో ఆదివారం కొనసాగింది. డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సీఎం జగన్, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. కొంతమంది అంగన్‌వాడీలు విజయవాడలో జరగనున్న నిరసన కార్యక్రమానికి వెళ్లారు. కార్యక్రమంలో జి.ఎల్.దేవి, టి.దుర్గ, ఎస్.కనకదుర్గ, కె.వి.ఎస్.కుమారి, జి.వెంకటలక్ష్మి, జి.సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం: సీఐటీయూ ఆధ్వర్యంలో 41వ రోజు కె.గంగవరం, రామచంద్రపురం మండలాల ప్రాజెక్ట్‌లకు చెందిన అంగన్వాడీలు దీక్షలో కూర్చున్నారు. కె.దుర్గాభవాని, చంద్రమ్మ, ఎం.దుర్గాభవానీ, ఎన్.వెంకటలక్ష్మి, ఎం.పద్మ, పి.సుజాత, పి.ప్రభావతి. సీహెచ్.వరలక్ష్మి, రాఘవ, లక్ష్మి, అబ్బాసి. రోజా, అనిత, నాంచారి రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈసందర్భంగా అంగన్వాడీ జిల్లా కార్యదర్శి మేడిశెట్టి దుర్గమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం దుర్మార్గమైన చర్యలు చేపట్టి అంగన్వాడీలను తొలగిస్తే భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించవలసి వస్తుందని హెచ్చరించారు. సేకరించిన కోటి సంతకాల పత్రాలను అధికసంఖ్యలో అంగన్వాడీలు తీసు కుని విజయవాడకు వెళ్లారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూకల బలరాం, రెండు మండలాల అంగన్వాడీలు పాల్గొన్నారు.



అల్లవరం పోలీసు స్టేషన్ వద్ద అంగన్‌వాడీలు

అల్లవరం: చలో విజయవాడ పిలుపు నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 24మంది అంగన్‌వాడీలను అల్లవరం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాజోలు ప్రాంతానికి చెందిన 24మంది అంగన్‌వాడీ వర్కర్లను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌లో ఉంచారు.

జనసేనకు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ

మామిడికుదురు, జనవరి 21: జనసేన పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతుందని ఆ పార్టీ మండలశాఖ అధ్యక్షుడు జాలెం శ్రీనివాస రాజా అన్నారు. పాశర్లపూడిలంకలో పార్టీలో తీర్థం పుచ్చుకుంటున్న పలువురికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, కోలా సతీష్, కుడుపూడి శ్రీనివాస్, కొమ్ముల జంగమయ్య, తెలగా రెడ్డి ఏసు, పినిశెట్టి శేఖర్, ఇంజేటి రవి పాల్గొన్నారు.

అపూర్వ కలయిక

ఆలమూరు, జనవరి 21: జడ్పీ బాలికోన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకుని సందడి చేశారు. ఈపాఠశాలలో 2002లో పదో తరగతి చదువుకున్న మొదటి బ్యాచ్ విద్యార్థినుల ఆత్మీయ కలయిక జరిగింది. తాము చదువుకున్న పాఠశాల ఆవరణలో ఉదయం నుంచి సాయంత్రం వరకు గడిపారు. చదువులు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించారు. నిమ్మకాయల వెంకటలక్ష్మి, కనకదుర్గ, వీరకొండ, నాగేశ్వరి పాల్గొన్నారు.



విశ్వబ్రాహ్మణ పితామహుడు గానాల జయంతి

అమలాపురం టౌన్, జనవరి 21: విశ్వబ్రాహ్మణ జాతి పితామహుడు, ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఎమ్మెల్సీగా పనిచేసిన గానాల రామమూర్తి జయంతిని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. స్థానిక గోల్డ్ మార్కెట్‌లో గానాల రామమూర్తి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. రాష్ట్ర యువజన సంఘం ఉపాధ్యక్షుడు కోసూరి చిదంబరాచారి అధ్యక్షతన పేద విశ్వబ్రాహ్మణులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు ఆవుపాటి వేణుగోపాల్, జిల్లా సంఘం నాయకులు చేబ్రోలు గంగానాగేశ్వరరావు, వరదా సత్యనారాయణ, కట్టోజు వెంకటసుబ్బారావు, లక్కోజు ప్రసాద్, బొల్లోజు మణిశ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా జిల్లా చేతివృత్తుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో గానాల రామమూర్తి జయంతిని నిర్వహించారు. జిల్లా సంఘం అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో గానాల చిత్రపటానికి పలువురు పూలమాలలువేసి నివాళులర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం, గిడ్ల సురేష్, షేక్ కరీముల్లా బాబా, దంగేటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ కుటుంబానికి ఆర్థిక సాయం

ఆత్రేయపురం, జనవరి 21: ఆత్రేయపురం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ కె.శాంతకుమారి మనోవేదనకు గురై గుండెపోటుతో మృతి చెందడంతో ఆదివారం ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి శాంతకుమారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.25వేలు ఆర్థిక సాయం అందించారు.

ఉచిత స్విమ్మింగ్ పోటీలు

ఆత్రేయపురం, జనవరి 21: ర్యాలి పిల్లకాలువలో అనష్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ వైద్యుడు మోహిత్ ఆధ్వర్యంలో చిన్నారులకు ఉచిత సిమ్మింగ్ శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షకుడు వెంకట్రావు సిమ్మింగ్‌లోని మెలకువలను నేర్పారు.

బీజేపీకి సలాది రాజీనామా

కొత్తపేట, జనవరి 21: బీజేపీ నాయకుడు, కొత్తపేట మాజీ ఉప సర్పంచ్ సలాది రామకృష్ణ బీజేపీకి రాజీనామా చేశారు. ఈమేరకు జిల్లా అధ్యక్షుడు యాళ్ళ దొరబాబుకు రాజీనామా పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను బీజేపీలో జిల్లా అధ్యక్షుడి కారణంగా పని చేస్తూ వచ్చానని, జాతీయపార్టీ అయినప్పటికి ఇక్కడ పార్టీ అభివృద్ధికి ఎవరూ కృషి చేయకపోవడం బాధ కలిగించిందన్నారు. అందుకే రాజీనామా చేసి తన అనుచరులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటానన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	గుంటూరు కారం
వెంకటరమణ	సైంధవ్
శ్రీలలిత	గుంటూరు కారం
శేఖర్ స్క్రీన్-1	హనుమాన్
శేఖర్ స్క్రీన్-2	నాసామిరంగ
రమా	గుంటూరు కారం
గణపతి	నాసామిరంగ
వెంకటపద్మావతిస్క్రీన్-1	గుంటూరు కారం
వెంకటపద్మావతి స్క్రీన్-2	సలార్

టీడీపీతోనే ముస్లిం, మైనార్టీ వర్గాలకు ఆదరణ



కొత్తపేట, జనవరి 21: మైనారిటీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని జిల్లా టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ మీరాన్‌షరీఫ్ చెప్పారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండపేటలో జరిగిన రా కదలిరా సభలో వేదికపై తమ నాయకుడితో పాటు పాల్గొనడం తనకు దక్కిన అరుదైన గౌరవంగా భావిస్తున్నానని, అంతేకాకుండా ముస్లిం సంప్రదాయ పద్ధతిలో తమ అధినేత చంద్రబాబును సత్కరించడం తనకు ఆనందం కలిగించిందన్నారు. ముస్లిం, మైనార్టీల మద్దతు టీడీపీకే అని షరీఫ్ పేర్కొన్నారు. రానున్నది టీడీపీ, జనసేన ప్రభుత్వమేనన్నారు.

ఆంజనేయస్వామి వార్షిక పూజలు

కాట్రేనికోన, జనవరి 21: ఉప్పూడిలో ఆదివారం అభయాంజనేయస్వామి వార్షిక పూజలు ఘనంగా జరిగాయి. లక్ష తమలపాకుల పూజ, 108కలశల పూజలు నిర్వహించారు. విగ్రహ నిర్మాణ దాత రంబాల విజయపరమేశ్వరశర్మం బ్రమూలాస్వామి (చిట్టిబాబు), భవానీ దంపతుల నిర్వహణలో ఆకొండి పవన్ కుమార్‌శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. ముద్రగడ మోహన్, కుమారి దంపతుల ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిగింది.

టీడీపీ ఇంచార్జ్‌ల నియామకం

పి.గన్నవరం, జనవరి 21: పి.గన్నవరం నియోజకవర్గానికి సంబంధించి వివిధ విభాగాల టీడీపీ ఇంచార్జ్‌లను నియమించినట్లు నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు నామన రాంబాబు తెలిపారు. నియోజకవర్గ పొలిటికల్ మేనేజర్‌గా చిన్నం బాలవిజయరావు, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్‌గా సూధా వెంకటస్వామినాయుడు, మీడియా కో-ఆర్డినేటర్‌గా బొరుసు చంద్రశేఖరరావు, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్‌గా కొప్పిశెట్టి రమేష్‌లను నియమించినట్లు తెలిపారు.

జేవీఎల్ నరసింహారావుకు అవార్డులు

ముమ్మిడివరం, జనవరి 21: రాణేలంక మొల్లికి చెందిన ఎల్బా ఇంటర్నేషనల్ కన్వీనర్ ఏవీఎల్ నరసింహారావుకు వాక్‌బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్, ఇంటర్నేషనల్ స్టార్ అవార్డులు దక్కాయి. ఆదివారం ఎంపీ చింతా అనురాధ నుంచి ఈఅవార్డులను నరసింహారావు తీసుకున్నారు. నరసింహారావు విద్యా సామాజిక రంగాల్లో చేస్తున్న కృషికి ఆరు జాతీయ, ఆరు అంతర్జాతీయ అవార్డులు లభించాయి. జేవీఎల్‌కు అవార్డులు రావడం పట్ల ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్, నాయకులు జగతా బాబ్జి, జగతా జానకీరామయ్య అభినందించారు.

బస్సు యాత్రను విజయవంతం చేయండి

కె.గంగవరం, జనవరి 21: ఈనెలాఖరున రామచంద్రపురం నియోజకవర్గంలో జరిగే సామాజిక బస్సు యాత్రను విజయవంతం చేయాలని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుబాష్‌చంద్రబోస్ అన్నారు. ఆదివారం కె.గంగవరంలోని శెట్టిబలిజ కల్యాణ మండ పంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లి సూర్యప్రకాష్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. సభ విజయ వంతానికి చేయాల్సిన కార్యక్రమాలు గురించి వివరించారు. కార్యక్రమంలో వైసీపీ రాజానగరం పరిశీలకులు వట్టికూటి సూర్యచంద్రరాజశేఖర్, ఏఎంసీ చైర్మన్ పండు గోవిందరాజు, ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు, జడ్పీటీసీ ఓలిశెనేని శ్రీవరలక్ష్మీరాజ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు పెట్టా శ్రీనివాసరావు, నాయకులు జుత్తుగ శ్యామ్‌ప్రసాద్, పంపన సత్యానందం, చోడే గోవిందరాజు, దూడల నాగేశ్వరరావు, చిల్లేనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

26న అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ

మండపేట, జనవరి 21: స్థానిక కరాచీ సెంటరులో ఈనెల26న అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఆవిష్కరిస్తామని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తెలిపారు. కరాచీ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం సముదాయంలో జరుగుతున్న విగ్రహాల ఏర్పాటు పనులను ఆయన ఆదివారం స్థానిక నేతలతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో తోట వెంటరెడ్డి రాధాకృష్ణ, ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైసీపీ పట్టణ అధ్యక్షుడు ముమ్మిడివరపు బాపిరాజు, పలివెల సుధాకర్, పోలిమాల సత్తిబాబు, ఉండ్రాజవరపు అర్జున్ పాల్గొన్నారు.

షిర్డిసాయి ఆలయ రజతోత్సవ వార్షికోత్సవం



బాబాను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రాపాక

మలికిపురం, జనవరి 21: మలికిపురం సెంటర్‌లో ఉన్న శ్రీషిర్డిసాయి ఆలయ రజతోత్సవం సందర్భంగా స్వామివారికి రజత జల సహిత మహా కుంభాభిషేకం జరిగింది. స్వామివారిని పూజాకలశాలతో ఎంతో మహత్తరమైన రజత జలంతో భక్తులు స్వహస్తాలతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, రాజోలు ఎంపీపీ కేతా శ్రీను, కె.చంటిరాజు, ముదునూరి గంగ రాజు, నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు. సాయి ఈశ్వర్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేలాది మందికి అన్నసమారాధన జరిపారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అసౌకర్యం కలగకుండా చూశారు.

24న సీఎం జగన్ పర్యటన

ఎమ్మెల్యే కుమారుడి వివాహానికి హాజరు

పి.గన్నవరం, జనవరి 21: వాడ్రేవుపల్లి గటిగంటివాసు ఫంక్షన్‌హాల్‌లో ఈనెల24న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు కుమారుడి వివాహం జరగనుంది. ఈకార్యక్రమానికి సీఎం జగన్ హాజరై వధూవరులను ఆశీర్వదిస్తారు. సీఎం పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను ఆదివారం జేసీ ఎస్ నుపూర్‌అజయ్ పరిశీలించారు. కల్యాణ మండంలో ఆదివారం జిల్లాస్థాయి అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. సమన్వయంతో పనిచేసి సీఎం పర్యటనను విజయవంతం అధికారులను జేసీ ఆదేశించారు. హెలిపాడ్ ఏర్పాటు స్థలాన్ని, సీఎం పర్యటించే రూట్లను అధికారులతో కలిసి ఆమె పరిశీలించి వారికి సూచనలు చేశారు. సమీక్షలో ఆర్డీవో ఎం.ముక్కంటి, ఆర్అండ్‌బీ ఎస్ఈ బి.రాము, ట్రాన్స్‌కో ఏఈ రవికుమార్, పంచాయితీరాజ్ ఎస్ఈ కె.చంటిబాబు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సీహెచ్ ఎస్.వి.కృష్ణారెడ్డి, సీపీవో వెంకటేశ్వర్లు, డీఎస్‌వో ఏ.పాపారావు, డీటీవో అశోక్‌ప్రతాప్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి వి.కృష్ణకుమారి, డీఎల్‌డీవో ఎం.ప్రభాకరరావు, డీఎస్పీ కె.వి.రమణ, తహసీల్దార్ జీఆర్ రాగూర్, సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎంపీడీవో ఎం.భారతీ పాల్గొన్నారు.

బీజేపీ సమావేశం

మలికిపురం, జనవరి 21: వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా అన్నారు. మలికిపురంలో జరిగిన రాజోలు నియోజకవర్గ కోర్ కమిటీ సమావే శంలో ఆయన మాట్లాడుతూ శక్తి కేంద్రాలు, బూత్ కమిటీలు పూర్తిస్థాయిలో నిర్మాణం చేయాలని కోరారు. అడబాల రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అడబాల సత్యనారాయణ, మాలే శ్రీనివాసనగేష్, ఇందుకూరి అచ్యుతరామరాజు, చెంపాటి శివరామకృష్ణంరాజు, మేడిచర్ల చాణుక్య పాల్గొన్నారు.

బాలబాలాజీ దేవస్థానంలో గోశాల ప్రారంభం

మామిడికుదురు, జనవరి 21: అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో మురమళ్లకు చెందిన దాతలు చీకట్ల చిన్నయ్య, ఆదిలక్ష్మి దంపతులు రూ.6లక్షలతో నిర్మించిన గోశాలను ఆదివారం ప్రారంభించారు. ప్రతీరోజు ఈగోశాలలో గోపూజ జరుగుతుందని ఏసీ గ్రంథి మాధవి తెలిపారు. సభ్యులు చిట్టాల సత్తిబాబు, గూటం శ్రీనివాస్, కొమ్ముల నూరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్



మండపేట, జనవరి21: మండపేటకు చెందిన వైసీపీ నాయకుడు రెడ్డి రాధాకృష్ణ ముఖ్య అనుచరుడు కొవ్వాడ అప్పన్నబాబు, అతడి సతీమణి, కౌన్సిలర్ కొవ్వా బేబిలు ఆదివారం మండపేటలో టీడీపీ జాతీయ అధ్య క్షుడు చంద్రబాబు సమక్షంలోఎమ్మెల్యే వేగుళ్ల సారధ్యంలో టీడీపీలో చేరారు. వారికి బాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారితోపాటు బీసీ నేత కుక్కల రామారావు పార్టీలో చేరారు.

ఘనంగా ముత్యాలమ్మవారి జాతర

రాయవరం, జనవరి 21: రాయవరంలో వేంచేసి ఉన్న ముత్యాలమ్మవారి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. కొప్పు వెలమల ఆరాధ్య దైవమైన పోలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా తొలిరోజు అమ్మవారి సోదరి ముత్యాలమ్మవారి జాతర నిర్వహించారు. ముత్యాలమ్మవారిని పూలతో అలంకరించారు. గరత నృత్యాలు, తీన్మార్ వ్యాయిద్యాలు, కురళ వాయిద్యాలు, బాణసంచాకాల్పులతో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, సభ్యులు బెల్లపు లీలా లక్ష్మణరావు, బండారు శ్రీనివాసరావు, కొల్లి అప్పారావు, కిలపర్తి అప్పారావు పాల్గొన్నారు.

కేంద్ర సంక్షేమ పథకాలను అమలుచేయాలి

మామిడికుదురు, జనవరి 21: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అధికారులు చిత్తశుద్ధితో అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా పేర్కొన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సమావేశాలు పెదపట్నం, అప్పనపల్లి, బి.దొడ్డవరం గ్రామాల్లో ఆదివారం జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో వేమా పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని, వాటిని ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెండా ఆదినారాయణ, కంకిపాటి సుబ్బారావు, పుసుపులేటి మహాలక్ష్మీరావు, వేగి వెంకటేశ్వరరావు, కటికిరెడ్డి గంగాధర్, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.